




బంగారమ్మగారు భలే మనిషి. ఆమెకు తెలినివాళ్లు ఆ ఊళ్లోనే లేరని ఢంకా విూద దెబ్బకొట్టి చెబుతుంది. అంతా కలిపి ఓ వెయ్యి జనాభాగల ఆపల్లెలో బంగారమ్మగారి భర్త శీతారామయ్యగారు ఏకోపాధ్యాయ పాఠశాల ప్రైవేటుగా నడిపి ఏదో ఓ పది ఎకరాల పొలం గడించారు. తమ ఏకైకపుత్రిక శ్యామసుందరిని అల్లారు ముద్దుగా పెంచి ఓ శ్రీమంతులబిడ్డ శ్రీనివాస్ చేతిలోపెట్టారు. ఆ ముహూర్తఫలమేమో గానీ అమ్మాయి అమ్మగారింట్లో ఆరుసంవత్సరాలు అలాగే ఉంది. బంగారమ్మగారికి ఖంగారయింది కానీ శీతారామయ్యగారికి చీమ కుట్టినట్లైనాలేదు. ఓ శుభముహూర్తాన అల్లుని ఆగమనం, అమ్మాయితో అమెరికా పయనం అంతా ఓ నెలరోజుల్లో జరిగి పోయింది.

తరువాత శీతారామయ్యగారికి జబ్బుచేసి మంచానపడ్డారు. ఉన్న ఒక్కగా నొక్క కూతురు ఈ దేశంలోనే లేదాయె, ఇటు భర్తేమో మంచానపడ్డాడు. బంగారమ్మగారు చాలా దిగులుపడింది. కానీ ఇరుగుపొరుగు వారి సహాయంతో, ఓదార్పు మాటలతో చాలా ధైర్యం తెచ్చుకునేది. శీతారామయ్యగారు ఉన్నట్లుండి ఓరోజు కన్నుమూశారు. ఈ విషయం శ్యామసుందరికి తెలిసేటప్పటికి నెలరోజులుపట్టింది. ఏకారణంవల్లవీలుపడలేదేమో కానీ శ్రీనివాస్, శ్యామసుందరిలు అంతదూరంనుండి సమయానికి రాలేకపోయారు. తన విచారాన్ని తెలియ పరుస్తూ శ్రీనివాస్, తండ్రిపోయినందుకు తన దుఃఖాన్నంతా వెళ్లడిస్తూ శ్యామసుందరి ఉత్తరాలు రాశారు. చుట్టాలు, పక్కాలు కార్యనిర్వహణచేసి మాట దక్కించుకున్నారు.

శీతారామయ్యగారుపోయిన తరువాత బంగారమ్మగారు మరీ దిగజారిపోయారు. ఆమె ఈ శోకంలోనే ఉండగా ఆమె ఇల్లు పొలం మాసి తమ పిల్లలనేమైనా పెంచుకుంటుందేమోనని పిల్లలుగల తల్లిదండ్రులు రాసాగారు. వాళ్లు తన డబ్బుకోసమే వస్తున్నారన్నసంగతి గ్రహించిన బంగారమ్మ అసలు తనకు పిల్లవాడిని దత్తుచేసుకునే ఆలోచనే లేదని అందర్నీ త్రిప్పిపంపింది. దత్తు చేసుకోవడంవలన ఉపయోగంలేదని కూతురుకు కొడుకు పుడితే వాడే ఆస్తికి వారసుడవుతాడని అందరికీ చెప్పింది. ఇదంతా గతం.

ప్రస్తుతం బంగారమ్మగారు చాలా గట్టి మనిషి. ప్రతి నయాపైస తూచి తూచి వాడుతుంది. రెండు ధోవతులతో, అన్నంలోకి ఒకటో అరో ఆధరువుతో కాలం వెళ్ళబుచ్చుతున్నది. ఉన్నట్లుండి ఒకరోజున బంగారమ్మగారికి అత్యానందకరమైన వార్త ఒకటి తెలిసింది. అల్లుడికి బొంబాయిలో ఉద్యోగం అయిందని, వారంరోజుల్లో వస్తున్నారని తెలిసింది. తనకు ఉన్నది శ్యామసుందరి ఒక్కతే కనుక తననుకూడా తీసుకు వెళ్ళడానికి వస్తున్నారేమో అనుకుంది బంగారమ్మ. ఆ ఆలోచనరాగానే బంగారమ్మగారి ఆనందానికి అవధులు లేకపోయింది. కానీ కొంత ఆలోచన చేసినవిూదట కొన్ని అనుమానాలు కలిగినవి. అల్లుడు పట్టుమని పదిరోజులన్నా తమఇంట్లో ఉండలేదు. ఇప్పుడు ఇంత ఆదరంగా ఉండటానికి కారణం తను ఎవరినైనా దత్తుచేసికుంటే



ఆస్తి పోతుందన్న కారణమేమో అనిపించింది. కొంతకాలం బాగా చూసుకుని ఆస్తి కాజేసి తిరిగి పంపుతారేమోనన్న అనుమానం కూడా వచ్చింది బంగారమ్మగారికి. శ్యామసుందరి మనసున మెదిలేసరికి ఈ ఆలోచనలన్నీ మాయమై బొంబాయి ప్రయాణ సన్నాహాలలో మునిగిపోయింది. అసలు తనను తీసుకెళ్తారో లేదో అని అనుమానం వచ్చేది. అయినా వాళ్ళకుమాత్రం ఎవరున్నారు పెద్దదిక్కు. ఏదో నన్ను తీసుకెళితే పెద్దదాన్ని, ఇంట్లో ఉంటాను, వాళ్ళకు అండగా ఉంటాను, ఉత్తరంలో రాయకపోయినంత మాత్రాన తీసుకువెళ్ళరనేముంది అని తనను తానే సమాధానపరచుకొనేది. పోనీ ఈ ఊళ్ళోనే ఉందామా అన్న ఆలోచన కూడ వచ్చేది. ఎటూ తేల్చుకోలేక తికమకగా ఉంది బంగారమ్మ.

శీతారామయ్యగారి ముఖ్య స్నేహితుడయిన విశ్వనాథంగారి సలహా పొందుదామని వాళ్ళింటికి వెళ్ళింది. సంగతి వింటూనే ఆయన 'ఉన్నది ఒక్కగానొక్క కూతురు. వాళ్ళు తీసుకెళ్తానంటే సంతోషంగా వెళ్ళక దీనికింత ఆలోచన ఎందుకమ్మా?' అని అన్నారు. అయితే తన నిర్ణయంలో పొరబాటేదీ లేదనీ, సరిగానే నిర్ణయించుకున్నాననీ అనుకుని, బయటికి 'అందుకే మీ సలహా పొందుదామని వచ్చానన్నయ్యగారూ, ఇక వస్తా'నని సెలవ తీసికొంది.

బంగారమ్మగారి బొంబాయి యాత్ర గురించి అప్పటికప్పుడే ఊరంతా పాకిపోయింది. చాలా అదృష్టవంతురాలనుకున్నారు కొంతమంది అతివలు. అల్లుడు, కూతురు ఎలా చూసుకుంటారోననే సంశయం వెలిబుచ్చారు మరికొందరు వనితలు. ఎకాయెకి బంగారమ్మదగ్గరికేవచ్చి తమ అభిప్రాయాలు వెళ్ళడించారు మరీ దగ్గరి పడతులు. ఎలాగయితేనేం ఆ ఊరిజనానికి బంగారమ్మగారి బొంబాయియాత్ర ఒక ప్రత్యేక ఆసక్తిదాయకమయింది.

విశ్వనాథంగారి భార్య పార్వతమ్మ చూసి వెళ్ళడానికి వచ్చింది. 'ఏం, అక్కయ్యా, ఎప్పుడు ప్రయాణం? అల్లుడు, కూతురు ఎప్పుడు వస్తారు?' అని అడిగి, 'పెద్ద పట్నానికి వెళుతున్నావుకదా, మరీ కొత్త ఫేషన్ అయిన బట్టలు లేకపోయినా నాలుగు కొత్త ధోవతులైనా ఉంటేగానీ సరిపోవు. కొన్నావా? లేదా? అంతా సర్దుకోవడం అయిందా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్న పార్వతమ్మగారితో 'ముందు కాస్త మంచి నీళ్ళు తాగు పార్వతమ్మా, అసలే ఎండలోవచ్చావు. తీరికగా మాట్లాడుకుందాము' అని మంచినీళ్ళిచ్చి ఆదరించింది బంగారమ్మ.

'అయితే పార్వతమ్మా, నాకు ఉన్నవి రెండే ధోవతులు. నీకు తెలుసుగదా ఇవే



ఒకటి కట్టుకుని, ఒకటి ఉతికితే సరిపోదా' అన్నది.

'ఆదేమిటి బంగారమ్మా, అసలు బస్తీ చూసినట్లయితే నాలుగు ధోవతులు కూడా సరిపోవంటావు నీవు. అక్కడ అందరూ ఇస్త్రీలకు వేసుకుంటారు బట్టలు. ఇస్త్రీకి వేస్తే వారంరోజులకుగానీ తేదు. నీవు ఇస్త్రీ బట్టలు కట్టుకోకపోతే అంత పెద్ద హోదాలో ఉన్న నీ అల్లుడు, కూతురు చిన్నబుచ్చుకోరా. నీకు తప్పక మరో అరడజను ధోవతులైనా ఉండాలి' అని నొక్కి వక్కాణించింది పార్వతమ్మ.

బంగారమ్మ పుట్టింది, పెరిగింది, మెట్టింది అన్నీ ఈ ఊరే అవడంతో ఆ ఊరు వదిలి ఎక్కడకూ ఎక్కువరోజులు వెళ్ళి ఉండలేదు. ఆమెకు ఇప్పటి నాగరికత, పట్నాలు, అక్కడి అలవాట్లు క్రొత్త, ఊహించలేని విషయాలు.


పార్వతమ్మ పుట్టిల్లు ఓ మాదిరి బస్తీ. తమ ఊళ్ళో చూడదగ్గ వింతలు, విశేషాలు అందరికీ చెబుతుంటుంది. అందర్నీ బస్తీ అలవాట్లు నేర్చుకోమని ప్రబోధిస్తుంటుంది. తను పొరపాటున పల్లెటూళ్ళో వచ్చి పడ్డానని భర్తనెప్పుడూ దెప్పుతుంటుంది. అందరికీ శుభ్రతను గూర్చి చెప్పడమేకాక ఎప్పుడూ నలిగని, ఇస్త్రీ బట్టలే వేసుకుంటుంది పార్వతమ్మ. భర్తపోయిన తరువాత ఇస్త్రీకి బట్టలువేసే అలవాటే పోయింది బంగారమ్మకు. భర్తపోయినాక అసలు ఆ అలవాటే మానుకుంది. ఇప్పుడు కూతురు, అల్లుడుదగ్గర ఉండటానికైనా

పుస్తకములు

5 పుస్తకముల సెట్టు రు. 5–50.

(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగ్‌రాత్ (3) చుంబన పద్ధతులు, (4) 84 ఆసనములు, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు. 2/-. పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.

SULEKHA TRADERS.
WAT-7) .Beat No. 13. Aligarh



వేసవి
కాలములో
చర్మ
బాధలను పొందకుండుటకు




సల్ఫర్
టాయిలెట్ సోపు
మొటిమలు. చెమట పొక్కులు, స్వల్పమైన యితర చర్మ బాధలను పోగొట్టి సుఖము నిచ్చును.

BENGAL CHEMICAL
CALCUTTA - BOMBAY - KANPUR

# బంగారమ్మగారి బొంబాయియాత్ర

తన అలవాట్లను మార్చుకోడానికి సిద్ధపడింది. పార్వతమ్మ సలహా చాలా ఉపయోగకరమని 'నీవుకూడా రా, ఇద్దరం కలిసి గుడ్డలు కొందాం' అని తోడు తీసుకెళ్ళి గుడ్డలకొట్లు మస్తానుదగ్గర నాలుగు ధోవతులు, రాకరాక వస్తున్న అల్లుడుకు ఒక సూటుగుడ్డ, కూతురికి రెండు చీరెలు కొన్నది. అప్పటికిగాని బంగారమ్మగారి మనసు తృప్తిపడలేదు.

సాయంత్రం విశ్వనాధంగారు వచ్చారు. భార్య, బంగారమ్మకు ప్రయాణానికి తగినంత సహాయం చేస్తుండటంచూసి సంతోషపడ్డారు. 'బంగారమ్మా, ఇక్కడపుట్టి ఇక్కడే పెరిగినదానవు. నీవు బొంబాయి పోతే ఈ ఇల్లు ఎంత బోసిపోతుందో మాశావా, అసలు ఈ ఇల్లేమిటి ఈ ఊరే బోసిపోతుంద'న్నాడు విశ్వనాధం. ఇల్లు మాటనేసరికి బంగారమ్మగారికి తను ఊరు విడిచినతరువాత ఇంట్లో దీపం పెట్టడం కోసమైనా అదె క్రిహ్యాలనుకుంది. వెంటనే ఆమాటే అనేసింది విశ్వనాధంతో. 'అవునమ్మా, నీవు చెప్పింది నిజమేను. కొత్తగా మన బడికి ఓపంతుల్ని వేశారు. ఆయనరాగానే ఏదో కొంత అద్దెకు ఏర్పాటుచేస్తాను. తాళం చెవి మాకిచ్చివెళ్ళు. అద్దెకిచ్చిన తర్వాత ఉత్తరం రాస్తాను' అని ఆ బాధ్యత స్వీకరించారు.

అల్లుడు, కూతురు వచ్చేరోజు ఇంకా రెండురోజులుమాత్రమే ఉంది. ఈలోపల పనులన్నీ ముగించి సిద్ధమవాలని నిర్ణయించుకుంది.

తరతరాలనుండి వారి ఇంట పాడిఉంటూ వచ్చింది. ఇప్పుడు అన్నీపోగా ఒక్క ఆవు మాత్రమే ఉన్నది. మర్నాటి ఉదయమే పేరయ్యశాస్త్రిగారనే ఒక బ్రాహ్మణుడికి సరసమైన ధరకు విక్రయించింది. పాలేరు సోమప్పను పిలిపించి పొలమంతా మగతాకి మాట్లాడించి మిగతా డబ్బు బొంబాయికి పంపేట్లు ఏర్పాటు చేయించింది.

ఆరోజే అల్లుడు, కూతురు వస్తారు. వేకువజామున నాలుగుగంటలకే లేచి అన్ని పనులుచేసి తొమ్మిదింటికే వంటపూర్తిచేసి వేయికళ్ళతో ఎదురు చూడసాగింది. వాకిట్లో కారాగిన చప్పుడు శ్రీనివాస్, శ్యామసుందరిలు లోనికి వస్తున్నారు. ఆనందపరవశంలో తన వళ్ళు తానే మరిచింది బంగారమ్మ. త్వరత్వరగా కాళ్ళకి నీళ్ళు తెచ్చిచ్చింది. 'నాన్‌సెన్స్' అన్నాడు. శ్రీనివాస్ కాదు ఇప్పుడు పేరు మారింది. శ్రీన్. బంగారమ్మ ఆదేమీ పట్టించుకోకుండా ఆప్యాయంగా శ్యామసుందరిని దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకుంది. 'ఏం అమ్మా? మంచి ధోవతి లేదా? డర్టీగా ఉన్నదే. నా డ్రెస్ పాడవుతుంది. వదులమ్మా' అని తల్లిచేతుల్లో నుండి అవతలకు తప్పుకొంది శ్యామసుందరి.

బాత్‌రూమ్ లేదని, కూర్చోడానికి కుర్చీలు లేవని, టేబుల్ నిగాల్స్‌కాదని నసిగి నసిగి సాయంత్రమే ప్రయాణమన్నాడు శ్రీనివాస్.

'ఏం నాయనా, పదిరోజులన్నా ఉండవా, ఇది మటుకు నీయిల్లుకాదా మీరుతప్ప ఎవరున్నారు నాకు' అంది బంగారమ్మ బతిమిలాడే ధోరణిలో.

'ఎవరికెక్కడ సుఖంగా ఉంటుందో వాళ్ళక్కడే ఉండటం మంచిది. ఆయనకిక్కడ సుఖంగా లేకపోతే నేనుమాత్రం ఎందుకుంటాను' అని తానూ ప్రయాణమైంది శ్యామసుందరి. సరే 'ఇక నాదేముంది నాయనా. అంతా మీ యిష్టం. మీరేం చేయమంటే అది చేసేదాన్నేగదా నేను' అని సరిపెట్టుకుంది. ఎలాగు తను కూడా వాళ్ళతో ఉండబోయేదేకదా అని.

కారు తెచ్చాను సార్ అన్న డ్రైవరు మాటలు వింటూనే అల్లుడికి సూటు, కూతురుకు చీరెలు ఇప్పించింది. శ్రీనివాస్ కారులోకివెళ్ళి కూర్చున్నాడు. 'అమ్మా, నీవిక్కడైతే సుఖపడుతావు ఇక్కడే ఉండు. ఉత్తరాలు రాస్తుంటాన'ని తల్లికిచెప్పి కారులో కూర్చుంది శ్యామసుందరి.

చేతిలోని సంచీ క్రిందపడి, కళ్ళలోనుండి అశ్రుధారలు ప్రవహించుచుండగా నోరెళ్ళబెట్టి నిశ్చేష్టురాలై నిలిచిపోయింది బంగారమ్మ. ●